DYNAMIC EDITION
# వాయిస్ టుడే
www.Voicetodaynews.com
https://epaper.voicetodaynews.com
జనగాత్రం - మననేత్రం
Follow
పేజీలు 2
మంగళవారం, నవంబరు 7, 2023
HYDERABAD RANGAREDDY NALGONDA MAHABOOBNAGAR MEDAK KHAMMAM KARIMNAGAR WARANGAL NIZAMBAD ADILABAD

## ముగిసిన కంటి శస్త్ర చికిత్స..



హైదరాబాద్: ఎల్వీప్రసాద్ ఆస్పత్రిలో టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు కంటి శస్త్ర చికిత్స ముగిసింది. దాదాపు రెండు గంటల పాటు చంద్రబాబుకు ఎల్వీప్రసాద్ వైద్యులు సర్జరీ చేశారు. సర్జరీ అనంతరం ఎల్వీప్రసాద్ ఆస్పత్రి నుంచి కాన్వాయ్‌లో టీడీపీ చీఫ్ ఇంటికి బయలుదేరి వెళ్లిపోయారు. చంద్రబాబుకు ఎల్వీప్రసాద్ వైద్యులు కంటికి శస్త్ర చికిత్స చేశారు. జూన్‌లో చంద్రబాబు ఎడమ కంటికి సర్జరీ జరుగగా.. ఈరోజు కుడి కంటికి శస్త్ర చికిత్స జరిగింది. నిన్న (సోమవారం) ఏఐజీలో చంద్రబాబుకు వైద్యులు చర్మ సంబంధిత పరీక్షలు నిర్వహించారు.




## బీజేపీ నాలుగో జాబితా ప్రకటన..
## మునుగోడు బరిలో ఆయనే!!



హైదరాబాద్, నవంబర్ 7, (వాయిస్ టుడే) తెలంగాణ రాష్ట్రంలో త్వరలో జరగనున్న ఎన్నికలకు అన్ని పార్టీలు ప్రచార పర్వాన్ని జోరుగా కొనసాగిస్తున్నాయి. ఇప్పటికే అభ్యర్థుల ప్రకటనలో ముందు వరుసలో నిలిచిన బీఆర్ఎస్ పార్టీ ఎన్నికల ప్రచారంలో కూడా ముందుంది. గులాబీ పార్టీ అధినేత కేసీఆర్ స్వయంగా రంగంలోకి దిగి నియోజకవర్గాలలో పర్యటిస్తూ ప్రజా ఆశీర్వాద సభలను నిర్వహిస్తూ పెద్ద ఎత్తున ప్రజల మద్దతు కూడగట్టే ప్రయత్నం చేస్తున్నారు. ఇదిలా ఉంటే కాంగ్రెస్ పార్టీ కూడా దూకుడుగా ప్రజాక్షేత్రంలోకి వెళ్లి ఎన్నికల ప్రచారాన్ని కొనసాగిస్తుంది. ఇక ప్రచారంలో కాస్త వెనుక పడ్డట్టు కనిపించిన బిజెపి అభ్యర్థుల ప్రకటనలు ఇంకా చేస్తూనే ఉంది. తాజాగా బిజెపి నాలుగో జాబితాను విడుదల చేసింది. బిజెపి నాలుగో జాబితా 12 మంది అభ్యర్థులతో విడుదల అయింది.

ఇప్పటివరకు నాలుగు జాబితాలలో 100 స్థానాలకు బీజేపీ అభ్యర్థులను ప్రకటించింది. పొత్తులలో భాగంగా జనసేనకు 7 సీట్లు ఇవ్వనున్నారు. జనసేనతో చర్చల తర్వాత మిగిలిన స్థానాలకు కూడా బిజెపి తమ అభ్యర్థులను ప్రకటించనుంది. అయితే ప్రస్తుతం బిజెపి ప్రకటించిన నాలుగో జాబితా వివరాల్లోకి వెళితే ఈ జాబితాలో బిజెపి చెన్నూరు నియోజకవర్గానికి దుర్గం అశోక్, ఎల్లారెడ్డి నియోజకవర్గానికి సుభాష్ రెడ్డి లను అభ్యర్థులుగా ప్రకటించింది.

హుస్నాబాద్ నియోజకవర్గానికి బొమ్మ శ్రీరాం చక్రవర్తి, సిద్దిపేట నియోజకవర్గానికి దూది శ్రీకాంత్ రెడ్డి, వికారాబాద్ నియోజకవర్గానికి పెద్దింటి నవీన్ కుమార్, కొడంగల్ నియోజకవర్గానికి బంటు రమేష్ కుమార్, గద్వాల్ నియోజకవర్గానికి బోయ శివ, మిర్యాలగూడ నియోజకవర్గానికి సాదినేని శివ, నకిరేకల్‌కు మొగులయ్య, ములుగు అజ్మీరా ప్రహ్లాద్ నాయక్, వేములవాడ తుల ఉమ, మునుగోడు చల్లమల్ల కృష్ణారెడ్డిని అభ్యర్థులుగా ప్రకటించింది. దీంతో వీరంతా ప్రజాక్షేత్రంలో జోరుగా ప్రచార పర్వంలో దూకుడును కొనసాగించనున్నారు. ఇంకా కొన్ని స్థానాలకు అభ్యర్థులను ప్రకటించాల్సి ఉంది. అవి కూడా త్వరలోనే ప్రకటించే అవకాశం ఉంది. ఏది ఏమైనా చివరి నిముషం వరకు బీజేపీ అభ్యర్థుల ప్రకటనలో చేస్తున్న జాప్యం పార్టీకి నష్టం చేసే అవకాశం ఉందన్న చర్చకు కారణం అవుతుంది.





## బీఎస్పీ ఓటు...
## ఎవరికి చేటు

హైదరాబాద్, నవంబర్ 7, (వాయిస్ టుడే): తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల్లో చిన్న పార్టీలన్నీ తలో దిక్కు చేరిపోతున్నాయి. అయితే పొత్తులు లేకపోతే పోటీ నుంచి విరమించుకోవడం వంటివి చేస్తున్నాయి. కానీ బహుజనసమాజ్ పార్టీ మాత్రం ఆ దిశగా ఆలోచించలేదు. ఒంటరిగా పోటీ చేస్తోంది. కనీసం వంద స్థానాల్లో పోటీ చేసేందుకు ప్రయత్నిస్తోంది. ఇప్పటికే మూడు జాబితాల ద్వారా బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు ప్రవీణ్ కుమార్ అభ్యర్థుల్ని ఖరారు చేశారు. అందరి దృష్టిని ఆకర్షించేలా ఓ ట్రాన్స్ జెండర్‌కూ టిక్కెట్ కేటాయించారు. మరో వైపు తాను స్వయంగా జనరల్ సీటులో పోటీకి దిగారు. సిర్పూర్ నుంచి తాడోపేడో తేల్చుకుంటానంటున్నారు. దీంతో ఎన్నికల్లో బీఎస్పీ ప్రభావం ఎంత ఉంటుందన్నదానిపై రాజకీయవర్గాల్లో భిన్నమైన చర్చలు నడుస్తున్నాయి. తెలంగాణలో బహుజన్ సమాజ్ పార్టీ ఉనికి గతంలో పెద్దగా ఉండేది కాదు. ఏదైనా పార్టీలో టిక్కెట్లు దొరకని నేతలు బీఎస్పీ బీఫాం తెచ్చుకుని పోటీ చేసి తమ సత్తా చాటేవారు. 2014లో బీఎస్పీకి ఆదిలాబాద్ జిల్లాలో రెండు సీట్లు వచ్చాయి. ఇంద్రకరణ్ రెడ్డితో పాటు కోనేరు కోనప్ప బీఎస్పీ సీట్లపై గెలిచారు. కానీ వారు కేవలం బీఫాం కోసమే ఆ పార్టీలో చేరారు. ఓ రకంగా ఇండిపెండెంట్లుగా గెలిచారు. తర్వాత వారు బీఆర్ఎస్ లో చేరారు. అదే పార్టీలో కొనసాగుతున్నారు. ఇప్పుడు మరోసారి పోటీ చేస్తున్నారు. ఆ పార్టీకి స్థిరమైన నాయకత్వం లేదు. జాతీయ అధ్యక్షురాలు మాయవతి కూడా ఎప్పుడూ పెద్దగా దృష్టి పెట్టలేదు. కానీ ఐపీఎస్‌గా వాలంటరీ రిటైర్మెంట్ తీసుకున్న ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ బీఎస్పీలో చేరి రాష్ట్ర అధ్యక్షుడిగా బాధ్యతలు తీసుకున్న తర్వాత ఆ పార్టీని బలోపేతం చేయడానికి తన వంతు ప్రయత్నం చేస్తున్నారు. ప్రవీణ్ కుమార్ సాదాసీదా ఐపీఎస్ కాదు. ఆయన ఐపీఎస్ అయినా.. పోస్టింగ్ మాత్రం సాంఘిక సంక్షేమ శాఖలో తీసుకున్నారు. తెలంగాణలోని గురుకుల పాఠశాలవ్యవహారాలను తొమ్మిదేళ్ల పాటు తన కనుసన్నల్లో ఉండేలా చూసుకున్నారు. " స్వేరోస్" అనే సంస్థను పాతుకుపోయేలా చేయగలిగారు. సోషల్ వెల్ఫేర్ ఏరోస్ ను స్వేరోస్‌గా పిలుస్తారు. ఈ సంస్థను ప్రవీణ్ కుమార్ ప్రారంభించ లేదు. కానీ ఈ సంస్థకు వెన్నుముకగా ఆయన నిలిచారు. ప్రవీణ్ కుమార్ హయాంలో గురుకల హాస్టళ్లలో స్వేరోస్ విస్తృతంగా విస్తరించారు. మెల్లగా స్వేరో భావాజాలను దళిత కాలనీలకు విస్తరించారు. స్వేరోస్ భావజాలం.. చాప కింద నీరులా విస్తరించింది. ఇప్పుడు వీరినే ప్రవీణ్ కుమార్ తన బలంగా భావిస్తున్నారు. దళిత భావజాలాన్ని అందుకే విస్తృతంగా వినిపిస్తున్నారు. తెలంగాణ రాష్ట్రంలో సమగ్ర కుటుంబ సర్వే ప్రకారం రాష్ట్రంలో 63,60,158 మంది దళితులున్నారు. అంటే రాష్ట్ర జనాభాలో 17.5 శాతం. వీరు రాజకీయ పార్టీల భవితవ్యాన్ని మార్చేయగలరు. ఆ విషయం రాజకీయ పార్టీలకు తెలుసు కాబట్టే.. దళిత వాదం అందుకుంటున్నారు. అయితే.. దళితుల్లో సహజంగానే తమను పైకి రానివ్వడం లేదన్న అసంతృప్తి ఉంటుంది. ఆ అసంతృప్తి నుంచి ఇప్పటి వరకూ ఒక్క సరైన నాయకుడు పుట్టుకురాలేదు. ఇప్పుడు తాను ఆ బాధ్యత తీసుకుంటానని.. వారికి నాయకుడిగా ఎదగాలని ప్రవీణ్ కుమార్ ప్రయత్నిస్తున్నారు. దీని కోసం ఆయన చాలా కాలం నుంచే గ్రౌండ్ వర్క్ చేసుకుంటున్నారు. దానికి స్వేరోస్‌నే సాక్ష్యం. స్వేరోస్ తెర వెనకు ప్రచారంలో సిద్ధహస్తులు. అందుకే బీజేపీ ఎంత ప్రభావం చూపిస్తుందన్నది అంచనా వేయడం కష్టంగా మారింది.

### జనరల్ సీటు అయిన సిర్పూల్‌లో ప్రవీణ్ కుమార్ పోటీ

రిజర్వ్ నియోజకవర్గంలో పోటీ చేసే అవకాశం ఉన్నప్పటికీ బీఎస్పీ చీఫ్ ప్రవీణ్ కుమార్ జనరల్ సీటు అయిన సిర్పూల్‌లో పోటీ చేస్తున్నారు. నియోజకవర్గంలో 90 శాతానికిపైగా ఉన్న

- 2వ పేజీలో

## సూట్‌కేసులతో వచ్చే దోపిడీ దారులు కావాలా?
## నిఖార్సైన నాయకులు కావాల్నా..?



### చెన్నూరు ప్రజా ఆశీర్వాద సభలో సీఎం కేసీఆర్

చెన్నూరు సూట్‌కేసులతో వచ్చే దోపిడీ దారులు కావాలా..? నిఖార్సైన నాయకులు కావాల్నా..? నిర్ణయించాల్సింది ప్రజలేనని సీఎం కేసీఆర్ అన్నారు. చెన్నూరు నియోజకవర్గంలో జరిగిన ప్రజా ఆశీర్వాద సభలో సీఎం కేసీఆర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 'ఎన్నికలు అనంగనే వట్టిగానే ఆగమాగం పిచ్చోళ్లలెక్క ఓటువేయొద్దు. మనం పిచ్చోళ్లమని వాళ్లు అనుకుంటున్నరు. అందుకే సూట్‌కేసులు పట్టుకొనివస్తే గెలిచిపోతమని అనుకుంటున్నరు.

సూట్‌కేసులతో వచ్చే దోపిడీ దారులు కావాలా? జేబులో పైస లేకుంట వచ్చే సుమన్‌లాంటి వ్యక్తి కావాలా? మీరే నిర్ణయం తీసుకోవాలి. తెలంగాణ కోసం పేగులుతెగేదాక కొట్లాడి.. జైళ్లపాలై.. ప్రజలు అవకాశం ఇస్తే గెలిచి, ఎమ్మెల్యే పని చేసినటువంటి నిఖార్సైన సుమన్‌లాంటి నాయకులు కావాల్నా? ఎలక్షన్లు వచ్చేసరికి నాలుగైదు పార్టీలు మార్చేసి సూట్‌కేసులు పట్టుకొని వచ్చేవారు కావాల్నా ? మీరే నిర్ణయం చేయాలి' అన్నారు.

### సూట్‌కేసు బాపత్ గాళ్లు వస్తనే ఉంటరు..

'ఈ ఆలోచన సరళి, ఈ పద్ధతి ప్రజలల్లో రానంత వరకు సూట్‌కేసుల బాపత్‌గాళ్లు వస్తనే ఉంటరు. నోట్లకట్టల బాపత్‌గాళ్లు వస్తనే ఉంటరు. వాళ్ల బలమంతా డబ్బే. ఎక్కడ కనిపించరు. ప్రజలకు ఆపతి వచ్చినాడు ఉండరు.. సంపతి వచ్చిననాడు ఉంటరు. దుఃఖం వచ్చిననాడు ఉండరు.. ఎలక్షన్లు రాంగనే వస్తరు. ఎలక్షన్లు రాంగనే ప్రేమలు కడుపుల నుంచి దేవుకొస్తయ్. మల్లయ్య మల్లయ్య ఇక రాబిడ్డ రెండు సీసలు తాగుదాందా.. ఈ ఇంట్లేమన్న లగ్గమున్నాది. నీ ఇంట్ల ఏమన్నా కార్యమున్నా ఎందుకిస్తున్నడు సీసలు. ఈ బాపత్‌గాళ్లను తరిమికొట్టకపోతే.. ఇది ప్రజాస్వామ్యం కాదు.. దానికి విలువ వుండదు.

ఈ జిల్లాల్లో ఇద్దరు ముగ్గురు మోపయ్యారు. ఒకడైతే పకాత్ పేకాట క్లబ్బులు పెట్టి పైసలు మందినెత్తికొట్టి సంపాదిస్తడు. అక్కడ ఇక్కడ ముంచి డబ్బులు తెచ్చి సీసాలు, అదిఇది పంచి గోల్‌మాల్ చేస్తున్నరు. గోల్‌మాల్ గోవిందం గాళ్లను ప్రజలు గోల్‌మాల్ చేయనంత వరకు ఇదే దరిద్రం ఉంటదని మనవి చేస్తున్నా. ఈ దరిద్రాన్ని వదిలించుకోవాలి. ఈ శక్తి మీ చేతుల్లోనే ఉంటది. వాడు వచ్చి అడిగితే మొహమాటానికి ఆ అనాలే. కానీ, చేసేకాడ చేసే పని చేయాలి. సురుకుపెట్టేకాడ పెట్టాలి. లేకపోతే దీనికి అర్థం లేకుండాపోతుంది. ప్రజలు ఆలోన చేయకపోతే పెద్ద ప్రమాదం వస్తుంది' అంటూ హెచ్చరించారు.



వాయిస్ టుడే
హైదరాబాద్
మంగళవారం, 7 నవంబరు, 2023

# బీఎస్పీ ఓటు... ఎవరికి చేటు

- మొదటిపేజీ తరువాయి

ఎస్సీ, ఎస్టీ, బీసీ ఓట్లు ఉన్నాయి. అభ్యర్థుల విజ యంలో ఈ ఓటర్లే కీలకపాత్ర పోషిస్తారు. కొంతకాలంగా అధికార పార్టీ విధానాలకు వ్యతిరేకంగా పోరాడుతున్న ప్రవీణ్ కుమార్.. ?దళితులు, ఆదివాసీలు, బీసీలు, మైనారిటీల పక్షాన గళం విప్పుతున్నారు. బహుజనులకు గత ప్రభుత్వాలు ఇచ్చిన అసైన్డ్? భూములను అభివృద్ధి పనుల పేరిట ప్రభుత్వం బలవంతంగా లాక్కోవడం, పోడు భూముల సమస్యకు శాశ్వత పరిష్కారం చూపకపోవడంతో పాటు నిర్వాసితులకు జరుగుతున్న అన్యాయంపైనా ప్రశ్నిస్తున్నారు. అయితే, ఇంటర్మీడియెట్ ?స్టూడెంట్లకు ఉచిత భోజనం లాంటి సేవా కార్యక్రమా లతో కోనప్ప యువతకు దగ్గరయ్యారు. ఇప్పుడా యూత్ తమవైపు మళ్లుతున్నారని ప్రవీణ్ అనుచరులు నమ్ముతున్నారు. స్వేరోస్ నాయకులు ఇప్పటికే సిర్పూర్?లో దిగి, చాపకింద నీరులా ప్రచారం చేస్తున్నారు. ప్రవీణ్ కుమార్ రాజకీయ ఆశలతో వచ్చిన జేపీ, వీవీ లక్ష్మినారాయణ వంటి వారిలా కాకుండా ఓ పార్టీ రాష్ట్ర శాఖకు నాయకత్వం వహిస్తూ.. నిరంతరం పోరాడుతున్నారు. ఆ పోరాట పటిమ ద్వారా ఓ బలమైన నాయకుడిగా ఎదిగే ప్రయత్నం చేస్తున్నారు. ఇతర పార్టీలతో పొత్తులకు అవకాశం వచ్చినా పట్టించుకోలేదు. దళిత వర్గాలను ఏకం చేసేందుకు ప్రయత్నిస్తున్నారు. ఎక్కువ ఓట్లు పొందితే ఎవరు నష్టపోతారన్న సంగతి పక్కన పెడితే.. ప్రవీణ్ కుమార్ తెలంగాణ రాజకీయాల్లో కీలక నేతగా ఎదిగే అవకాశం ఉంది.

# మళ్లీ దత్తత అంటే ఉరికిద్దాం.. ఈసారి జండూభామ్ పని చేయదు



నల్గొండ (వాయిస్ టుడే): 2018లో దత్తత పేరుతో నల్గొండ ప్రజలను మోసం చేశారని.. మళ్లీ దత్తత అని చెప్పే వాళ్ళని ఉరికించాలని కాంగ్రెస్ నేత కోమటిరెడ్డి వెంకటరెడ్డి విమర్శలు గుప్పించారు. మంగళవారం మీడియాతో మాట్లాడుతూ... 30న పోలింగ్ ఉంది కాబట్టి 27 నుంచి మీ అకౌంట్లోకి రుణమాఫీ, రైతు బంధు డబ్బులు వస్తాయని... మోసపోవద్దని అన్నారు. కొట్లాడి తెచ్చిన తెలంగాణాలో.. కేవలం 460 మంది అమరులని వారికే డబ్బులు, ఉద్యోగాలు ఇచ్చారన్నారు. తెలంగాణ కోసం ఆత్మబలిదానాలు చేసుకున్న 1200 మందికి న్యాయం జరగలేదని అన్నారు. ఉద్యోగులకు నెలాఖరుకు జీతాలు, పదేళ్లలో ఒక్క రేషన్ కార్డు ఇవ్వలేదని మండిపడ్డారు. కేసీఆర్ డిసెంబర్ 3న రాజీనామా చేస్తారని.. డిసెంబర్ 9న కాంగ్రెస్ ప్రభుత్వం ప్రమాణ స్వీకారం చేస్తుందని ధీమా వ్యక్తం చేశారు. “ఏ హెూదాలో ఉన్నా నల్గొండనే శ్వాస.. నా ప్రాణం... మీరే నాకన్నీ.. వారంలో మూడు రోజులు ఇక్కడే ఉంటా. ఈసారి జండూభామ్ పని చేయదు” అని అన్నారు. నల్గొండలో నేను, మునుగోడులో రాజ్‌గోపాల్ రెడ్డి, నకిరేకల్‌లో వీరేశంలను 70 వేల మెజార్టీతో గెలిపించాలని కోరారు. కాంగ్రెస్ పార్టీకి 80కి పైగా సీట్లు రాబోతున్నాయని.. ఐదేళ్లు ప్రశాంతంగా నల్గొండను అభివృద్ధి చేసుకుందామని కోమటిరెడ్డి వెంకటరెడ్డి పేర్కొన్నారు.



# అలాంటి వారిని మహిళలే చెప్పుతో కొడతారు

ఖమ్మం (వాయిస్ టుడే): కాంగ్రెస్ అభ్యర్థి తుమ్మల నాగేశ్వరరావు ప్రచారంలో దూసుకుపోతున్నారు. ప్రతీ రోజు రోడ్ షోలు నిర్వహిస్తూ బీఆర్ఎస్ పాలనపై విరుచుకుపడుతున్నారు. ఈరోజు (మంగళవారం) 44వ డివిజన్‌లో తుమ్మల రోడ్‌షో నిర్వహించగా.. భారీగా కాంగ్రెస్ శ్రేణులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా తుమ్మల మాట్లాడుతూ.. ఈ ఎన్నికల్లో కాంగ్రెస్ గెలుపుకు మహిళలే రథసారధులన్నారు. ఇందిరమ్మ రాజ్యం కోసం మహిళలు కథం తొక్కాలని పిలుపునిచ్చారు. ఖమ్మంలో అరాచక ప్రభుత్వం, పోలీస్ రాజ్యం తరమికొట్టాలన్నారు. అధికారంతో బెదిరించే వారిని మహిళలే చెప్పుతో కొడతారన్నారు. ఉద్యోగస్తులపై అక్రమ కేసులు నమోదు చేసి వేధిస్తున్నారని మండిపడ్డారు. అక్రమ కేసులు అవినీతి రాజ్యంపై ఖమ్మం రగిలిపోతుందని తెలిపారు. ఇంత దారుణమైన రాజ్యం ఖమ్మంలో ఎన్నడూ చూడలేదన్నారు. కాంగ్రెస్ పాలనతోనే ఖమ్మంలో ప్రశాంత ఖమ్మం రాబోతోందని తుమ్మల నాగేశ్వరరావు పేర్కొన్నారు.




# జనగామలో నామినేషన్ వేసిన పల్లా రాజేశ్వర్ రెడ్డి

జనగామ (వాయిస్ టుడే): జనగామ అసెంబ్లీ నియోజకవర్గం బీఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థిగా పల్లా రాజేశ్వర్ రెడ్డి ఇవాళ నామినేషన్ దాఖలు చేశారు. రిటర్నింగ్ ఆఫీసర్ మురళీ కృష్ణకు తన నామినేషన్ పత్రాలను ఆయన అందజేశారు. ఈ కార్యక్రమానికి జనగామ ఎమ్మెల్యే ముత్తిరెడ్డి యాదగిరిరెడ్డి, మాజీ మంత్రి పొన్నాల లక్ష్మయ్య, స్టేషన్ ఘన్ పూర్ ఎమ్మెల్యే తాటికొండ రాజయ్య, మాజీ ఎమ్మెల్సీ వెంకటేశ్వర్లు, మాజీ ఆప్కో చైర్మన్ మండల శ్రీరాములు హాజరయ్యారు.

ఇవాళ ఉదయం ఇంట్లో వేద పండితులు పల్లాకు ఆశీర్వచనం అందజేశారు. ముస్లిం,క్రైస్తవ మత పెద్దలు కూడా పల్లాను దీవించారు. ఆ తర్వాత ర్యాలీ తీస్తూ.. పల్లా తన అనుచరులతో నామినేషన్ వేసేందుకు వెళ్లారు. ఇవాళ రెండు సెట్ల నామినేషన్ దాఖలు చేసినట్లు పల్లా మీడియాతో తెలిపారు. బీఆర్ఎస్ పార్టీని గెలిపించిన జనగామ ప్రజలకు సేవ చేసే అవకాశాన్ని కల్పించాలని ఆయన కోరారు.

# తిరుమల తరహాలో శ్రీ పద్మావతి అమ్మవారి వాహన సేవలు

## తిరుచానూరులో కోయిల్ ఆళ్వార్ తిరుమంజనంలో పాల్గొన్న టీటీడీ ఛైర్మన్ శ్రీ భూమన కరుణాకరరెడ్డి



తిరుపతి : తిరుమల శ్రీవారి బ్రహ్మోత్సవ వాహన సేవల తరహాలో తిరుచానూరు శ్రీ పద్మావతి అమ్మవారి వాహన సేవలను వైభవంగా నిర్వహించేందుకు అధికారులు ఏర్పాట్లు చేపడుతున్నారని టీటీడీ ఛైర్మన్ శ్రీ భూమన కరుణాకరరెడ్డి తెలిపారు. తిరుచానూరు శ్రీ పద్మావతి అమ్మవారి ఆలయంలో మంగళవారం కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమంలో పాల్గొన్న అనంతరం టీటీడీ ఛైర్మన్ కరుణాకర రెడ్డి మీడియాతో మాట్లాడారు. అమ్మవారి బ్రహ్మోత్సవాలకు ముందుగా జరిగే కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం కార్యక్రమాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించామన్నారు. నవంబరు 9న అంకురార్పణ, 10న ధ్వజారోహణంతో బ్రహ్మోత్సవాలు ప్రారంభమవుతాయని చెప్పారు. 14న అమ్మవారికి అత్యంత ప్రీతిపాత్రమైన గజవాహన సేవకు పటిష్టమైన భద్రతా ఏర్పాట్లు చేస్తున్నారని, ఎక్కువ మంది భక్తులు దర్శించుకునేలా అధికారులు చక్కటి ప్రణాళికల్ని రూపొందించారని తెలిపారు. 18న పంచమితీర్థానికి విశేషంగా భక్తులు తరలివచ్చి కోనేరులో పుణ్యస్నానాలు చేస్తారని, ఎలాంటి అసౌకర్యం కలగకుండా ఏర్పాట్లు జరుగుతున్నాయని చెప్పారు. దాదాపు రూ.9 కోట్లతో పంష్కరిణిని ఆధునీకరించి నీటితో నింపారని తెలియజేశారు.

ఆలయంలో ఉదయం 6 నుండి 9 గంటల వరకు కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం నిర్వహించారు. ఇందులో ఆలయ ప్రాంగణం, గోడలు, పైకప్పు, పూజాసామగ్రి తదితర వస్తువులను నీటితో శుద్ధి చేసిన అనంతరం నామకోపు, శ్రీచూర్ణం, కస్తూరి పసుపు, పచ్చాకు, గడ్డ కర్పూరం, గంధం పొడి, కుంకుమ, కిచీలిగడ్డ తదితర సుగంధ ద్రవ్యాలు కలగలిపిన పవిత్రజలాన్ని ఆలయం అంతటా ప్రోక్షణం చేశారు.



# హుజూరాబాద్ కంటే గజ్వేల్‌లోనే అధిక మెజారిటీ వస్తుంది: ఈటల

గజ్వేల్ (వాయిస్ టుడే): ప్రజాస్వామ్య హక్కులు కాపాడేందుకు ఓటు ఏకే47 లాంటిదని గజ్వేల్ భాజపా అభ్యర్థి ఈటల రాజేందర్ అన్నారు. కేంద్ర మంత్రి, బాజపా రాష్ట్ర అధ్యక్షుడు కిషన్ రెడ్డితో కలిసి మంగళవారం గజ్వేల్లో ఈటల నామినేషన్ వేశారు. ఈ సందర్భంగా ఈటల మాట్లాడుతూ.. అసెంబ్లీ ఎన్నికల్లో భారాస ఓడిపోవడం ఖాయమన్నారు. తనకు హుజూరాబాద్ కంటే గజ్వేల్ లోనే అధిక మెజారిటీ వస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. 20 వేల మందికి ఫోన్ చేస్తే 50 వేల మంది వచ్చారని ఈటల హర్షం వ్యక్తం చేశారు.

# లిఫ్ట్‌లో ఇరుక్కుని నాలుగేళ్ల బాలుడు మృతి



హైదరాబాద్: నగరంలోని ఎల్బీనగర్ ఆర్టీసీ కాలనీలో దారుణం చోటు చేసుకుంది. నూతన భవనంలో లిఫ్ట్‌లో ఇరుక్కొని అక్షయ్ కుమార్(4) అనే బాలుడు మృతి చెందాడు. గత 20 రోజులుగా వాచ్‌మెన్‌గా పనిచేస్తున్న నాగరాజు, అనురాధల కొడుకు అక్షయ్. లిఫ్ట్ సరిగ్గా పనిచేయకపోవడంతో బాలుడు అందులో ఇరుక్కుపోయాడు. దీన్ని గమనించిన తల్లిదండ్రులు వెంటనే బాలుడిని ఆస్పత్రికి తరలించగా.. చికిత్స పొందుతూ మృతి చెందాడు. తమ కొడుకుని తమకు చూపించకుండా పోలీసులు, బిల్డింగ్ ఓనర్స్ పోస్ట్ మార్టంకు తరలించారని తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. డెడ్ బాడీని కూడా చూడనివ్వకుండా ఎలా తరలిస్తారని ఆందోళనకు దిగారు. ఈ ఘటనకు సంబంధించిన వివరాలు కూడా చెప్పకుండా సెక్టర్ ఎస్సై గోప్యంగా ఉంచడంపై సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.



# డిసెంబర్‌లో భారత్ జోడో యాత్ర 2.0కు సన్నాహాలు

న్యూఢిల్లీ : భారత్ జోడో యాత్ర మలి విడత యాత్రకు కాంగ్రెస్ పార్టీ సన్నాహాలు చేపట్టింది. వచ్చే ఏడాది సార్వత్రిక ఎన్నికలు జరగనుండగా డిసెంబర్–ఫిబ్రవరిలోగా భారత్ జోడో యాత్ర 2.0ను ప్రారంభించేందుకు ఆ పార్టీ కసరత్తు సాగిస్తోంది. రాహుల్ గాంధీ సారథ్యంలో సాగే మలి విడత యాత్రలో భాగస్వాములయ్యే వారు కాలినడకన ఆపై వాహనాలనూ ఉపయోగించేలా హైబ్రిడ్ మోడ్‌లో సాగుతుందని ఆ పార్టీ వర్గాలు తెలిపాయి. భారత్ జోడో యాత్ర తొలి దశ 2022 సెప్టెంబర్ 7న తమిళనాడులోని కన్యాకుమారిలో ప్రారంభమై కశ్మీర్‌లోని శ్రీనగర్‌లో 2023 జనవరిలో ముగిసింది. ఈ యాత్ర 12 రాష్ట్రాల్లోని 75 జిల్లాల మీదుగా 126 రోజుల పాటు కొనసాగింది. యాత్ర పొడవునా రాహుల్ గాంధీతో పాటు పలువురు సీనియర్ కాంగ్రెస్ నేతలు క్షేత్రస్థాయి నేతలు, కార్యకర్తలు, ప్రజలతో మమేకమవుతూ ముందుకుసాగారు.

బీజేపీ విభజన రాజకీయాలకు వ్యతిరేకంగా ప్రజల్లో చైతన్యం తీసుకువచ్చే ఉద్దేశంతో రాహుల్ గాంధీ ఈ యాత్రను చేపట్టారని కాంగ్రెస్ వర్గాలు చెబుతున్నాయి. భారత్ జోడో యాత్ర 2.0ను ప్రారంభించాలని పలువురు నేతలు సైతం రాహుల్ గాంధీకి విజ్ఞప్తులు చేస్తుండటంతో మరో విడత యాత్రకు ఏర్పాట్లు జరుగుతున్నాయని కాంగ్రెస్ వర్గాలు పేర్కొన్నాయి.






# టీడీపీ ఓట్ల కోసమేనా..పొత్తు

హైదరాబాద్, నవంబర్ 7, (వాయిస్ టుడే)

తెలంగాణలో అసెంబ్లీ ప్రచారం ఊపందుకుంది. పార్టీలు విరామం లేకుండా ప్రచారం చేస్తున్నాయి. గెలుపే లక్ష్యంగా పార్టీలు వ్యూహాలు రూపొందిస్తున్నాయి. ముచ్చటగా మూడోసారి అధికారంలోకి రావడానికి గులాబీ పార్టీ పావులు కదుపుతుంటే... కారుకు బ్రేకులు వేయాలని హస్తం పార్టీ ఎత్తులు వేస్తోంది. తెలంగాణ విజయం సాధించి..దక్షిణాదిన కాషాయ జెండాను రెపరెపలాండించాలని బీజేపీ పైఎత్తులు వేస్తోంది. కమలం పార్టీ, జనసేన పొత్తుపై తెలంగాణలో ఆసక్తికర చర్చ జరుగుతోంది. 2018 ముందస్తు అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ జస్ట్ ఒక్క సీటుతోనే సరిపెట్టుకుంది. హిందూత్వవాది రాజాసింగ్ గోషామహల్ నియోజకవర్గం నుంచి గెలుపొందారు. తర్వాత జరిగిన ఉపఎన్నికల్లో దుబ్బాకలో రఘునందన్ రావు, హుజురాబాద్ లో ఈటల రాజేందర్ విజయం సాధించారు. దీంతో బీజేపీ బలం మూడుకు చేరుకుంది.ప్రస్తుత అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ, జనసేన కలిసి పోటీ చేస్తున్నాయి. తెలుగుదేశం పార్టీ కలిసి వస్తుందని భావించినా అది జరగలేదు. శాసనసభ ఎన్నికల్లో జనసేనకు తొమ్మిది సీట్లను కేటాయించింది. మొదట జనసేన 11 చోట్ల పోటీ చేయాలని నిర్ణయించింది. ఇరు పార్టీల నేతల చర్చల 9 స్థానాలకు అంగీకారం కుదిరింది. కూకట్‌పల్లితోపాటు మరో ఎనిమిది స్థానాల్లో జనసేన పోటీ చేయనుంది. ఖమ్మం, అశ్వారావుపేట, కొత్తగూడెం, మధిర, వైరా, నాగర్‌కర్నూల్, కోదాడ, కూకట్‌పల్లి స్థానాలు కేటాయించినట్టు సమాచారం. శేరిలింగంపల్లి స్థానంపై ఇంకా పీటముడి వీడలేదు. శేరిలింగంపల్లి కోసం జనసేన పట్టుబడుతోంది. బీజేపీలోనూ శేరిలింగంపల్లి స్థానంపై తీవ్ర పోటీ నెలకొంది. ప్రధాని మోడీ రాష్ట్ర పర్యటన తర్వాత శేరిలింగంపల్లి సీటుపై క్లారిటీ వచ్చే అవకాశముంది. బీజేపీ, జనసేన పొత్తుపై తెలంగాణలో జోరుగా చర్చ సాగుతోంది. 2018లో రెండు సీట్లు సాధించిన తెలుగుదేశం పార్టీ, ప్రస్తుత అసెంబ్లీ ఎన్నికలకు దూరంగా ఉంది. దీనిపై అనేక రకాలుగా విమర్శలు వచ్చినా వాటిని పట్టించుకోకుండా చంద్రబాబు ఆరోగ్య పరిస్థితుల రీత్యా సైలెంట్ అయింది. పది సంవత్సరాలుగా తెలుగుదేశం పార్టీ ఆశించిన స్థాయిలో ఫలితాలు సాధించకపోయినా, ప్రతి జిల్లాలో, నియోజకవర్గాల్లో ఇప్పటికి చెక్కుచెదరని ఓటు బ్యాంక్ ఉంది. ఆ ఓటు బ్యాంక్ ను తమ వైపు తిప్పుకునేందుకు బీజేపీ, జనసేన కలిసి బరిలోకి దిగాయి. తెలుగుదేశం పార్టీకి ఉన్న ఓటు ఈ కూటమి వైపు మళ్లితే మెజార్టీ సీట్లు సాధించవచ్చన్న ధీమాలో బీజేపీ, జనసేన నేతలు ఉన్నారు. గ్రేటర్ హైదరాబాద్ పరిధిలోని 24 నియోజకవర్గాల్లో సీమాంధ్ర ఓటర్లు భారీగా ఉన్నారు. సాఫ్ట్ వేర్ ఉద్యోగులతో పాటు తెలంగాణలోని ప్రతి నియోజకవర్గంలో టీడీపీకి ఓటర్లు ఉన్నారు. ఇవన్నీ సాలిడ్ గా కూటమికి పడతాయన్న లక్ష్యంతోనే పొత్తు పెట్టుకున్నట్లు తెలుస్తోంది. 119 అసెంబ్లీ స్థానాల్లో ఇప్పటికే 88 చోట్ల అభ్యర్థులను బీజేపీ ప్రకటించింది. మిగిలిన 31 స్థానాలకు 9 చోట్ల జనసేన బరిలోకి దిగనుంది. 22 స్థానాలకు కాషాయ పార్టీ అభ్యర్థులను రెండు రోజుల్లో ప్రకటించనుంది. ఎన్నికల్లో రెండు పార్టీల అభ్యర్థుల విజయానికి సమష్టిగా పని చేయాలని రెండు పార్టీల నేతలు నిర్ణయించారు.